ప్రజాశక్తి
www.prajasakti.com
మంగళవారం 10 అక్టోబర్ 2023



యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పోరుమామిళ్ల టౌన్ : యుటిఎఫ్ నూతన మండల కమిటీని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా ప్రాంతీయ మహాసభలు నిర్వహిమని జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ అన్నారు. విద్యా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తిరుగులేని విజయాలను సాధించిందన్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ కుమార్, ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా నూనె శ్రీనివాసులు, కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శులుగా గంగయ్య, విజయరావు, సిద్దయ్య, శ్రీధర్‌గౌడ్, వెంకటరెడ్డి, సంజీవ్ కుమార్, మండల కమిటీకి గౌరవాధ్యక్షులుగా పి.సుధీర్ కుమార్ ఎన్నికయ్యారు.


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘోర రోడ్డు ప్రమాదం

ఓ కుటుంబం మల్లెలలోని దర్గా దర్శనానికి ఆటోలో కడప నగర సమీపంలోని ఆజాద్‌నగర్ నుంచి బయలుదేరింది. ప్రొద్దుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి మల్లెలకు పయనమయ్యారు. ఎర్రగుంట్ల పట్టణ సమీపంలోని ఓ కల్యాణ మండపం వద్దకు ఆటో రాగానే ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి వేగంగా వచ్చి ఢీకొంది. ఆటో కాస్త తునాతునకలైంది. వాహనంలోని వారందరూ చెల్లాచెదురుగా పడిపోయారు. ఆ దృశ్యం చూసిన వారందరి గుండెలు ఝల్లుమన్నాయి. మృతదేహాలను చూసి, క్షతగాత్రుల ఆహాకారాలు వింటూ కళ్లు చెమ్మగిల్లాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు.

- ఆటోను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు
- కడపకు చెందిన నలుగురు దుర్మరణం
- మృతుల్లో భార్యాభర్తలు
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- గాయపడిని వారిని పరామర్శించిన ఆర్‌డిఒ, డిఎస్‌పి


బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఆటో


రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు


సంఘటనా స్థలంలో రోధిస్తున్న మృతుల బంధువులు


మృతుల బంధువులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డు బైపాస్ వద్దనున్న ఎస్‌వి కల్యాణ మండపం వద్ద సోమవారం ఆటోను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే.. పులివెందుల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు శ్రీశైలం వెళుతుండగా ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్ల వైపు వస్తున్న ఆటోను బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోలో మహిళా డ్రైవర్‌తో సహా 10 మంది ప్రయాణిస్తుండగా అందులో డ్రైవర్ అమీనా(20), షాకీర్ (10), మహమ్మద్(25), హసీనా(25) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సిఐ ఈశ్వరయ్య, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారు ఒకరికొకరు బంధువులు కావడంతో సమాచారం అందుకున్న మృతుల బంధువులు మృతదేహాల వద్ద రోధిస్తున్నారు. బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతి చెందిన మహమ్మద్, హసీనా భార్యాభర్తలు కడప నగరం ఆజాద్ నగర్ కాలనీకి చెందిన వారు. మహమ్మద్ కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. ప్రొద్దుటూరులోని తమ బంధువుల ఇంటికి వెళ్లి అక్కడి నుంచి మల్లెల గ్రామంలోని దర్గా దర్శనానికి అందరూ కలిసి ఆటోలో బయలుదేరారు. ప్రొద్దుటూరు నుండి ఎర్రగుంట్ల వైపు వెళుతున్న ఆటో ఎస్‌వి కల్యాణ మండపం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్టేక్ చేయబోయే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఆర్‌డిఒ

ఆర్‌టిసి బస్సు, ఆటోను ఢీకొన్న ఘటనలో గాయాలపాలై ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురిని జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు పరామర్శించారు. ప్రమాద ఘటన గురించి ఆరా తీశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రొద్దుటూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులకు సూచించారు.

ప్రమాదం దురదృష్టకరం : డిఎస్‌పి

ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు పరామర్శించారు. ప్రమాదఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడం దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

దేశంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

- ఎపిడబ్ల్యూజెఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

దేశంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ పిలుపు మేరకు ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులు రాజు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సంఘ సేవకులు సలావుద్దీన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని దాని జీవనాధారమైన భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కులు, ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కడం మోడీ పాలనలో కొత్తేమీ కాదన్నారు. భారత దేశాన్ని హిందుత్వ-ఫాసిస్ట్ నియంతృత్వంలోకి వేగంగా లాగడం, దానిని వ్యతిరేకించే వారిని అణిచి వేయడం నిరంతర ఎత్తుగడని తెలిపారు. బిజెపి ప్రభుత్వ విమర్శకులను దేశద్రోహులుగా చిత్రీకరించి జైలుకు పంపడం పరిపాటిగా మారిందని విమర్శించారు. చారిత్రాత్మక రైతాంగ సమ్మెకు మద్దతు ఇచ్చినందుకు దిశా రవిని అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో స్వేచ్ఛాయుత మీడియా కార్యకలాపాలను లేకుండా చేసేందుకు ఈ విధమైన ఉగ్రవాదానికి తెరలేపారని విమర్శించారు. ఇది భారతదేశంలోని మీడియా స్వేచ్ఛ వాస్తవ స్థితిని వెల్లడిస్తుందని పేర్కొన్నారు. నిజాన్ని మాత్రమే ప్రజలకు చేరవేసే మీడియా సంస్థలు, జర్నలిస్టులపై ఇంత పెద్ద ఎత్తున నిరంకుశ దాడి చేయడం ఆమోదయోగ్యం కాదని హెచ్చరించారు. ప్రజల తరపున ఉద్యమిస్తున్న మీడియాను లక్ష్యంగా చేసుకుని వారిని హింసించటం, అణిచివేసేందుకు చేస్తున్నటువంటి కుట్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య భావాలు కలిగిన ఈ దేశపు పౌరులు, దేశభక్తులందరూ ఐక్యంగా ఉద్యమించాలి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ 'న్యూస్ క్లిక్' కార్యాలయం, జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి జర్నలిస్టుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కెమెరాలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. సీనియర్ జర్నలిస్టులను కూడా అరెస్టు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఫాసిస్టు ఎత్తుగడలను ఎదిరించి మానవ హక్కుల కోసం పోరాడిన అనేక మందిని మోడీ పాలనలో తప్పుడు కేసులు బనాయించి, దేశద్రోహ నేరారోపణలు చేసి జైలుకు పంపారని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు మన్సూరు అక్బర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, రాయలసీమ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు మల్లెల భాస్కర్, లోక్ సత్తా నాయకులు కృష్ణ ప్రసంగించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, పత్రికా విలేకరులు, మీడియా ప్రతినిధులు సిద్దయ్య, నారాయణ, మురళి, నందకుమార్, వనం శర్మ, నాగేందర్‌రెడ్డి, బాషా, వెంకటేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఓబులేసు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.


ఉరి తాళ్లను మెడకు కట్టుకొని వినూత్న నిరసన చేస్తున్న నాయకులు

వైసిపి ఎంపీలు రాజీనామా చేయాలి

- కలెక్టరేట్ వద్ద ఆందోళనలో అఖిలపక్ష నేతల డిమాండ్

ప్రజాశక్తి-కడప అర్బన్

కృష్ణా నీటి వివాదాలపై ఏర్పాటైన ట్రిబ్యునల్స్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిని పునఃపంపిణీ పేరుతో ఎపి, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేస్తూ బ్రిజేష్ కుమార్ ట్రిబునల్‌కు అదనపు బాధ్యతలను కట్టబెట్టి తద్వారా తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బిజెపి కుట్రలను ఎండగడతామని, అడుగడుగునా రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్న స్పందించని వైసిపి ఎంపీలు రాజీనామా చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో అఖిలపక్ష నేతలు ఎన్.తులసిరెడ్డి, గాలి చంద్ర, లక్ష్మిరెడ్డి, సత్తార్, రాము, రమణయ్య, దస్తగిరిరెడ్డి, గురప్ప, నరసింహులు డిమాండ్ చేశారు. మూడు రాష్ట్రాల విజ్ఞప్తి మేరకు ఏర్పాటైన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇదివరకే బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను యథావిధిగా అమలు చేస్తూనే మిగులు జలాలను కూడా 448 టిఎంసిలుగా లెక్కగట్టి పంపిణీ చేయాలన్నారు. మిగులు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగొండ, తెలుగుగంగ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనున్నదని తెలిపారు. రాయలసీమ ద్రోహి జగన్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, వెంకట శివ, వీరశేఖర్, నాగసుబ్బారెడ్డి, భాగ్యలక్ష్మి, మైనుద్దీన్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

ఇష్టపడి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చిన వారవుతారని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాడు ఎంబిఎ, ఎంసిఎ కోర్సులో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. క్యాంపస్ ప్లేస్మెంట్ నిర్వహించడంతో ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. ర్యాగింగ్ అనేది ఉండదన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎంబిఎ, ఎంసిఎ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కృపా కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-కడప

కడప నగరంలోని 48 డివిజన్ కృపా కాలనీలోని చర్చి ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీ, వీధి లైట్లు మౌలిక సదుపాయాలు చేపట్టేందుకు మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్య అన్నారు. సోమవారం కాలనీని సందర్శించి పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ద్వారా ఇక్కడ సమస్యలను తెలుసుకున్నారు. చర్చి ప్రహరీ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ సమస్యలను మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకుపోయి త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని బరోసా ఇచ్చారు. పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా కాలనీని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ, ఎసిపి నాయకులు గువ్వల మధుసూదన్ రావు, కె.కృష్ణ, బుడగజంగం నాయకులు డి.శ్రీరాములు, వాలంటీర్ పి.రవితేజ చర్చి సభ్యులు పాల్గొన్నారు.


కృపా కాలనీని పరిశీలిస్తున్న వైసిపి నాయకులు బంగారు నాగయ్య

విప్లవ కెరటం చే గువేరా : డివైఎఫ్‌ఐ


చే గువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎగిసే విప్లవ కెరటం చేగువేరా అని, యువత ఆయనని ఆదర్శంగా తీసుకోవాలని, విభజన హామీల అమలు కోసం కడప ఉక్కు కోసం యువత చే స్ఫూర్తితో పోరాటాలలో భాగస్వామ్యం అవ్వాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం చేగువేరా వర్ధంతి సందర్భంగా కడప ఐటిఐ కాలేజీలో చే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు అమెరికా సామ్రాజ్యవాదనికి ఎదురొడ్డి, క్యూబా పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరుడు చేగువేర అన్నారు. డాక్టర్ వృత్తిలో వుండి పేదల కోసం అహర్నిశలు కష్టపడి గెరిల్లా పోరాట ఉద్యమాలు నిర్వహించి సామ్రాజ్య వాదుల చేతిలో వీరమరణం పొందాడని తెలిపారు. చేగువేరని అందరూ చే అని పిలుస్తా రన్నారు. 1967, అక్టోబర్ 9న అమెరికా సామ్రాజ్యవాదుల చేతిలో వీర మరణం పొందాడని పేర్కొన్నారు. ప్రస్తుతం యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం బిజెపి ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమను విస్మరించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని రాష్ట్ర హక్కుల కోసం మోడీ దగ్గర తాకట్టు పెట్టిందన్నారు. మతోన్మాదం పేరుతో దేశంలో అణగారిన వర్గాల పై దాడులు, అత్యాచారాలు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు. యువత హక్కుల కోసం పోరాడటానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నగర అధ్యక్షులు షాకీర్,కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం:** ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు గండి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో చే గువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండలశాఖ అధ్యక్షులు కలివేరు రాజశేఖర్, సహాయ కార్యదర్శి దేవకుమార్, సుధాకర్, తేజ, వర్మ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** చేగువేరా స్ఫూర్తితో విభజన హామీల అమలు కోసం, విద్యా రంగ అభివృద్ధి కోసం పోరాటాల్లో భాగస్వామ్యం అవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ కోరారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అనిల్, సురేష్, బాబు, క్రిష్టపర్, జాన్, మహ్మద్, అశ్వర్థ్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** చేగువేరా వర్ధంతి సందర్భంగా స్థానిక శ్రీవిద్య జూనియర్ కళాశాలలో డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని 30వ డివిజన్ స్థానిక సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు డి.ఎం.ఓబులేసు డిమాండ్ చేశారు. సోమవారం డివిజన్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ డివిజన్ పరిధిలో పాలంపాపయ్యవీధి 4వ రోడ్‌లో 6 నెలలుగా డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయడం లేదని చెప్పారు. కొన్ని కాలువలను పూర్తిగా మట్టి తోటి నిండిపోయాయని పేర్కొన్నారు. కాలువ లు శుభ్రం చేయమని ప్రజలు అడుగుతే సాయిబాబా ఐరేన్ షాపు రేకులు అడ్డంగా ఉన్నాయని కాలం వెళ్లబుచ్చడం దుర్మార్గమని విమర్శించారు. ఖాళీ స్థలాలలో మట్టి, చెత్తాచెదారాలతో నిడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనారోగ్య పాలవుతున్నారని చెప్పారు. కార్పొరేటర్, కమిషనర్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రజలను కలుపుకుని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు షకీలా, లతిఫా, షఫీయా, వహీదా, ఉదయ్, మైనుదిన్ బాషా పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-వల్లూరు

మండల పరిధిలోని బాలు గారిపల్లిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయిం చాలని తహశీల్దార్ శంకర్రావుకు ప్రజలు సోమవారం వినతి పత్రం అందజేశారు. గతంలో ఉన్న శ్మశాన వాటిక పట్టా భూమిలో ఉండడంతో ప్రస్తుతం ఆ పట్టాదారులు ఆ శ్మశాన వాటికను ఆధీనంలో తీసుకున్నారు. బాలుగారిపల్లిలో శ్మశాన వాటిక లేకపోవడంతో గ్రామస్తులు అవస్థలకు గురవుతున్నారని తెలిపారు. ఏదైనా ప్రభుత్వ భూమి ఉంటే శ్మశాన వాటికకు ఇవ్వాలని కోరారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే ఇబ్బందికరంగా ఉందని తెలియజేశారు. తహశీల్దార్ శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఉంటే శ్మశాన వాటిక కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సురేష్ కుమార్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కాశిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

గోపవరం మండలం, మడకలవారిపల్లె గ్రామం, సర్వే నంబరు 9777/3 విస్తీర్ణం ఎ.2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంచేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, నకిలీ రికార్డులు సృష్టిస్తున్నారని, కబ్జాదారులమీద ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేసి ప్రభుత్త భూముల అక్రమన అడ్డుకోవాలని జిల్లా భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ కోరారు. సోమవారం కలెక్టర్ విజయ్‌రామరాజుకు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ 2021, అక్టోబర్ 6న వినతి పత్రం అందజేశానని తెలిపారు. దీనిపై స్పందించిన మీరు స్పందించి గోపవరం తహశీల్దారు, ఆర్‌డిఒకి తెలియజేశారని చెప్పారు. వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోను, కబ్జాదారులకు సహకరించి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసుకుని ఇండ్లు నిర్మించుకునేందుకు అవకాశం కలిగించారని పేర్కొన్నారు. ఆర్‌డిఒ దృష్టికి పరుమార్లు తీసుకువెళ్లినా కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. స్థానిక అధికారులకు పెద్దమొత్తంలో ముడుపులు ముట్టినట్లు అనుమానంగా ఉందని తెలిపారు. నిజాయతీ గల జిల్లా అధికారిచే విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలిన కోరారు. కార్యక్రమంలో అంజి, రాజేంద్ర పాల్గొన్నారు.

వైవీయూలో పీజీ ప్రవేశాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

వేమన విశ్వవిద్యాలయంలో పీజీ ప్రవేశాల ప్రక్రియతో విద్యార్థుల సందడి నెలకొంది. వైవీయూ పి జి సెట్-2023 రాసి అర్హత సాధించిన రాష్ట్రంలోని వివిధ జిల్లాల విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన డైరెక్టర్ ఆచార్య కంకణాల గంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విసి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రవేశాల ప్రక్రియను పరిశీలించారు. సజావుగా కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా సంచాలకుల ఆచార్య గంగయ్య మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా వైవీయూకు ఆప్షన్ ఇచ్చుకున్న విద్యార్థుల వివరాలు విసి దృష్టికి తెచ్చారు. 10వ తేదీ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ అసోసియేట్ డైరెక్టర్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ శ్రీధర్ బాబు, శ్రీధర్‌రెడ్డి, ఆచార్య కాత్యాయిని, డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, డాక్టర్. రామకృష్ణ, ఆచార్య వి.సునీత, సహ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస గౌడ్, డాక్టర్ గణేష్ నాయక్ సంచాలకుల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మల్లేశ్వరి

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి :ఎంపిపి

ప్రజాశక్తి-వల్లూరు

మండలంలో పలు సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని ఎంపిపి మల్లేశ్వరి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అజెండా అంశాలతో పాటుగా అభివృద్ధి సంబంధించిన ప్రణాళికలను ఈ సమావేశంలో చర్చించుకోవాలని తెలిపారు. సమావేశానికి వచ్చే ముందు మండల, గ్రామ స్థాయి అధికారులు అజెండాకు సంబంధించిన అంశాలను ఎంపిడిఒకు అందజేయాలని సూచించారు. ఎప్పుడైతే ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తాం అప్పుడే మండలం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం విద్యా, ఉపాధి, వ్యవసాయ, గృహ తదితర శాఖ అధికారులు తమ అజెండా అంశాలను సభకు చదివి వినిపించారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలలో వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ జుబేదా, తహశీల్దార్ శంకర్రావు, ఇఒపిఆర్‌డి ప్రసాద్, అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండల పరిధిలోని ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మాధవిలత అన్నారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని మండపంపల్లి రెవెన్యూ డివిజన్లో మంగంపేట దగ్గర 20 /1సర్వే నెంబర్ 2.48 ఎకరాలు భూమిని కొంతమంది చదును చేసుకొని కబ్జాకు పాల్పడుతున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. వెంటనే అక్కడ ప్రభుత్వ భూమి బోర్డు పెట్టించామన్నారు. మండలంలో ఎక్కడైనా కబ్జా జరిగినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియచేసారు.

సాంకేతిక నైపుణ్యత అవసరం

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులకు కొత్త సాంకేతిక నైపుణ్యత అవసరమని కాంచీపురం ఐఐఐటిడియం సహాయ ఆచార్యులు డాక్టర్ విజయకుమార్ కృష్ణస్వామి అన్నారు. సోమవారం కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం సంయుక్త అధ్వర్యంలో సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్, కేంద్ర ప్రభుత్వ సంస్థ న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో స్మార్ట్ హైబ్రీడ్ పునరుత్పాదక శక్తి సాంకేతికతలు అనే అంశంపై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి సరఫరా సమతుల్యత, విశ్వసనీయత మెరుగుపరచడానికి స్మార్ట్ గ్రిడ్లు అవసరమని పేర్కొన్నారు. 2030 సంవత్సరం నాటికి పునరుత్పాదక శిలాజ రహిత ఇందన వనరులు నుంచి 500 గిగా వాట్స్ శక్తి ఉత్పత్తికి నిబద్ధతని పేర్కొన్నారు. డేటా సైన్స్, బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, వంటి కొత్త సాంకేతిక నైపుణ్యం అవసరమని తెలిపారు. సదస్సు నిర్వహించటం పట్ల కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్మోహన్ రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి హర్షన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి ప్రేమ్ కుమార్, ఇసిఇ విభాగాధిపతులు డాక్టర్ జి.హేమలత, ప్రోగ్రామ్ సమన్వయ కర్త డాక్టర్ ఎం.వెంకట నారాయణ, డాక్టర్ టి.మారి ప్రశాంత్, డాక్టర్ సోను కుమార్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కెఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామ సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. పులివెందుల మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. ఎంపీ ప్రజా సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేలా అధికారులకు సూచనలిచ్చారు. ప్రజల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. విద్యా, వైద్య రంగాలపై సిఎం ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ రామాంజనేయరెడ్డి హాజరయ్యారు. అనంతరం సంస్థ చైర్మన్ మాట్లాడుతూ పౌష్టికాహారానికి సంబంధించి ఖర్జూర, వేరుశనగ ఉండలు, ఆపిల్, దానిమ్మ పండ్లు వంటి పలు రకాల పదార్థాలతో కూడిన ప్యాకెట్లను 40 మంది గర్భిణులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు జ్యోత్స్న, పద్మావతి, సూపర్వైజర్ ఓబులేసు, మానవతా సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని అందిస్తున్న మానవత సభ్యులు

రైతులకు అండగా జగన్ ప్రభుత్వం

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చి రైతన్నలకు అండగా జగనన్న ప్రభుత్వం చేయూత నిస్తోందని వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెనికలపాడు గ్రామం రైతు భరోసా కేంద్రంలో సోమవారం శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రబీలో శనగ పంట సాగు చేసేందుకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు అందిస్తుందన్నారు. ఒక రైతుకు కనిష్టంగా 20 నుండి గరిష్టంగా 200 కిలోలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



శనగలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - చాపాడు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని సచివాలయ మహిళా పోలీసు కె.సునంద తెలిపారు. మైదుకూరు పట్టణంలోని పదవ వార్డు సచివాలయ పరిధిలోని మహిళలకు సోమవారం ఆమె బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చేసిన, బాల్య వివాహాలకు హాజరైనా చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరం తర్వాత వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిఎంఎస్ కె.సునంద

కాపునాడు నియోజకవర్గ అధ్యక్షులుగా హరి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కాపునాడు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులుగా బోడిశెట్టి హరి రాయల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ మేరకు హరి రాయల్ సోమవారం మాట్లాడుతూ రాయలసీమ కాపునాడు అధ్యక్షులు గంగుల వీరాంజనేయులు జాతీయ కాపునాడు అధ్యక్షులు గాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలకు, బలిజ కులస్తులకు ధన్యవాదాలు తెలిపారు. కాపునాడు అభివృద్ధికి, విద్య, ఉద్యోగ క్రీడా సాంస్కృతిక వ్యాపార రంగాల్లో కాపు బలిజ తెగల ఒంటరి బాగు కోసం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్యటించి ఉన్న సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు.



వైద్య శిబిరానికి విశేష స్పందన

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఎంపిడిఒ విజయభాస్కరరావు ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. వైద్య సిబ్బందితో చర్చించి క్యాంపునకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఐదు లక్షల రూపాయల ఉచిత వైద్యాన్ని ప్రతి ఒక్క కుటుంబం ఉచితంగా పొందవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్, మండల వైసిపి కన్వీనర్ లక్ష్మిరెడ్డి, బి కోడూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది, సచివాలయ, ఆశా ఆరోగ్య మిత్ర ఒ సుధాకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెగ్యులర్ పిజిటిలుగా పరిగణించాలి

వేంపల్లె : ప్లస్ టు పాఠశాలలో పనిచేస్తున్న పిజిటిలను రెగ్యులర్ చేసి రెండు ఇంక్రిమెంట్లను వెంటనే మంజూరు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వేంపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని బాలికల విద్యను మెరుగుపరచడానికి నూతనంగా ప్రవేశపెట్టిన ప్లస్ టు పాఠశాలల్లోని పిజిటి ఉపాధ్యాయులకు రెగ్యులర్ పదోన్నతి కల్పించి ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు నాయకులు వన్నూరు భాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప–తాడిపత్రి జాతీయ రహదారిలో తోళ్ల గంగన్నపల్లి గ్రామం వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. కడప నుండి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కరుణానిధి అనాథాశ్రమం ఇద్దరు విద్యార్థులు తోళ్ల గంగన్నపల్లి వద్ద ఆపి ఎక్కారు. వీరు గంగాయపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు. వల్లూరు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కింద పడ్డారు. చెన్నై నుంచి తాడిపత్రికి వెళ్తున్న లారీ కింద పడిన వ్యక్తులపై ఎక్కడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కడపకు చెందిన మధుసూదన్‌రెడ్డి (28)ని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

రైతులకు లాభదాయకం చీనీ మార్కెట్

పంట అమ్ముకోవడానికి సులభతరం



రైతులు అమ్మకానికి తెచ్చిన చీనీ కాయలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన చీనీ కాయల కొనుగోలు కేంద్రం రైతులకు చాలా లాభదాయకంగా ఉంది. చీనీ కాయలను రైతులు అమ్ముకోవడానికి ఈ కొనుగోలు కేంద్రం సులభతరంగా ఉంది. ఈ నేపథ్యంలో చీని కాయల మార్కెట్‌కు రోజురోజుకు రైతుల నుంచి మంచి ఆదరణ పెరుగుతుంది. రైతులు తమ పంటను మార్కెట్లోకి తెచ్చుకొని బహిరంగ వేలం ద్వారా దళారీ వ్యవస్థ లేకుండా అమ్ముకోవడానికి సౌకర్యం కల్పించారు. రైతు తమ పంటను అమ్ముకోవడానికి సులభమైంది. మార్కెట్ ఎన్ని టన్నులు కాయలు వచ్చాయి.. ఇతర మార్కెట్లో టన్ను ధర ఎంత ఉన్నది అనే విషయాలను మార్కెట్ కమిటీ అధికారులు రైతులకు వివరిస్తున్నారు. దీంతో దళారీ వ్యవస్థ నుంచి రైతులకు విముక్తి కలిగిందని చెప్పవచ్చు. అంతేకాకుండా చీనీ వ్యాపారులు రైతుల దగ్గరికి వెళ్లినప్పుడు గ్రేడింగ్, సూట్ పేరుతో రైతులను మోసం చేసేవారు. దీంతో చీనీ రైతులు నష్టపోయేవారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం సూట్ లేకుండా రైతులే స్వయంగా తమ చీనీ కాయలను అమ్ముకునేలా పులివెందుల మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వ్యాపారులు రైతుల దగ్గరికి వెళ్లి పంటను తీసుకుని నెల రోజుల తర్వాత డబ్బులు చెల్లించేవారు. కానీ ప్రస్తుతం మార్కెట్లో రైతుల పంటను కొనిన వెంటనే వ్యాపారులు రైతులకు సొమ్ము చెల్లిస్తున్నారు. ఈ వ్యవస్థను ఇలానే కొనసాగించి ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చేలా మార్కెట్ కమిటీ ప్రయత్నిస్తే వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతులకు మరింత మేలు జరుగుతుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా మార్కెట్ యార్డ్ కమిటీ అధికారులు చొరవ తీసుకొని మార్కెట్ వ్యవస్థ ఇతర ప్రాంతాలకు విస్తరించేలా ప్రయత్నిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుంది.

శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే మరింత మేలు

రైతులు తమ పంటను నిల్వ ఉంచుకోవడానికి శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే మరింత మేలు జరుగుతుంది. వ్యాపారులు రానప్పుడు రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోకుండా గిడ్డంగులలో నిల్వ ఉంచుకోవచ్చు. మరసటి రోజు తమ పంటలను మంచి ధరలకు అమ్ముకోవడానికి వీలుంటుంది.

- వి.రామిరెడ్డి, రైతు, కర్ణపాపాయపల్లి, లింగాల

రైతులకే మేలు కలిగేలా ప్రయత్నిస్తున్నాం



అనంతపురం, హైదరాబాద్ నుంచి మంచి వ్యాపారులను పిలిపించడానికి చర్యలు తీసుకుంటున్నాం. మార్కెట్‌కు ఎక్కువ సరుకు వస్తే ఎక్కువ మంది వ్యాపారాలు వచ్చే దానికి వీలుంటుంది. రైతులకు మేలు చేసే దానికోసం మార్కెట్ యార్డ్ కమిటీ అన్ని విధాలా ప్రయత్నం చేస్తుంది.

- చిన్నప్ప, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్, పులివెందుల

క్రమశిక్షణాయుత జీవనంతో మానసిక వ్యాధులు దూరం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో డాక్టర్ కవితా ప్రసన్న

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మనిషి చిన్నప్పటి నుండి క్రమశిక్షణగా జీవిస్తే మానసిక వ్యాధులు దరిచేరవని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎన్ కవితా ప్రసన్న అన్నారు. మంగళ వారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా వరుస వత్తిళ్లకు గురైనప్పుడు మానసిక అనారోగ్యం ఏర్పడుతుందన్నారు. గుండె ఎక్కువ సార్లు కొట్టుకోవడం, చెమటలు పట్టడం, మలవిసర్జనకు పోవలసి రావడం వత్తిడి లక్షణాలుగా పేర్కొన్నారు. మొదటిసారి వత్తిడికి గురైనప్పుడే గుర్తించి వైద్యుడిని సంప్రదిస్తే కౌన్సిలింగ్ ద్వారా మంచి ఫలితం ఉంటుందన్నారు. ఈ లక్షణాలతో వత్తిడి అని గుర్తించక అవగాహన లోపం వల్ల ఇతరత్రా చికిత్సలు చేయించుకున్నా ప్రయోజనం ఉండద న్నారు. మానసిక వ్యాధికి శారీరక చికిత్సలు పని చేయవని ఆమె తెలిపారు. ఇలాంటి సమయంలో భూతవైద్యం, నాటు వైద్యం వైపు మళ్లితే సమస్య పరిష్కారం కాకపోగా మరింత జటిలమవుతుం దన్నారు. విని కిడి శక్తి తగ్గిపోయి భ్రమలు, విభ్రమలు కలుగుతా యన్నారు. ఎదురుగాలేని వస్తువును ఉన్నట్లుగా ఊహించుకోవడం భ్రమ అని, వినని సమాచారాన్ని విన్నట్లుగా ఊహించుకోవడం విభ్రమ అన్నారు. మానసిక రుగ్మతలు వంశ పారంపర్యంగానూ, పరిస్థితుల ప్రభావంతో, శరీరంలో రసాయనాల హెచ్చు తగ్గుల వల్ల, అజ్ఞానం వల్ల కలుగుతాయన్నారు. ఇలాంటి అనుమానం వచ్చిన వెంటనే మానసిక వైద్యుడిని సంప్రదించాలని ఆమె సూచించారు. ఆరంభంలోనే కౌన్సిలింగ్, థెరపీ ద్వారాగాని నయం చేయ వచ్చు న్నారు. గుణం కనిపించని పక్షంలో కొన్ని రకాల మందుల వల్ల మానసిక అనారోగ్యాన్ని అధిగమించవచ్చున్నారు. వంశపారంపర్యంగా సంభవించే వారు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా వత్తిడిని దరిచేరని వ్వకూడదన్నారు. ధ్యానం, యోగా, ప్రాణాయామం ప్రతిరోజు చేయ డంతో పాటు మనసుకు ఆహ్లాదపరిచే విషయాల పట్ల అంటే సంగీతం వినడం, ప్రకృతిని ఆస్వాదించడం, నిర్మలమైన ఆకాశం వైపు చూడడం, మంచి పుస్తకాలు చదవడం వంటివి చేయాల న్నారు. మంచి పోషకాహారంతోపాటు సరిపడ నిద్ర అవసరం అన్నారు. కనిష్టంగా ఆరు గంటల నిద్ర అవసరమన్నారు. ప్రధానంగా ఆత్మన్యూనతా భావాన్ని విడనాడాలన్నారు. ఆత్మవిశ్వాసం పెంచుకోవడం చాలా అవసరమని ఆమె వివరించారు. అవసరం మేరకు మాత్రమే టి.వి., సెల్‌ఫోన్ వాడాలన్నారు. వ్యసనాలు మానసిక అనారోగ్యానికి దారితీస్తాయన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ వారు ఈ సంవత్సరాన్ని 'మానసిక ఆరోగ్యం–సార్వత్రిక మానవహక్కు' నినాదంగా ప్రకటించిందని డాక్టర్ కవితా ప్రసన్న తెలిపారు.



హెచ్ఆర్ పాలసీ కాలపరిమితిని రద్దు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విఒఎల హెచ్ఆర్ పాలసీ మూడేళ్ల కాలపరిమితి సర్కులర్‌ను రద్దు చేయాలని, రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ రెండు డిమాండ్లతో ఈనెల 10,11 తేదీల్లో మండలాల వద్ద ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని రాకాల బకాయిలు చెల్లించడంతోపాటు లోకోయుఫ్ వర్క్ కోసం 5జి మొబైల్‌ను ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. వాలంటరీ ఐడితో విఒఎలను పనిచేయించరాదని, విఒఎ ఐడి ద్వారానే పనిచేయించాలని, వేతనాలు చెల్లించాలని, మెడ్జ్ వల్ల ఉపాధి కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆయా డిమాండ్లతో జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధ వారాల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టి తహశీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. ఆందోళనలను విజయవంతం చేయాలని విఒఎలను కోరారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారు



మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సిరిపురంగా పేరొందిన ప్రొద్దుటూరును అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరును క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు ఎమ్మెల్యే అడ్డాగా మార్చారని విమర్శించారు. అసాంఘిక కార్యక్రమాలకు ఎమ్మెల్యే రాచమల్లు బిగ్‌బాస్ అన్నారు. క్రికెట్ బుకీలకు ఎమ్మెల్యే రెడ్ కార్పెట్ వేశారన్నారు. క్రికెట్ బుకీలను కౌన్సిలర్లను చేసిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. ప్రొద్దుటూరులోని ఇద్దరు సిఐలు ఎస్‌పి స్పెషల్ దాడులు గురుంచి బుకీలకు ముందుగానే సమాచారం ఇవ్వడంతో చాలా మంది తప్పించుకున్నారని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే రెండు సెంట్లు స్థలంలో ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారని, చేతనైతే ఒక ఇల్లు కట్టించి, ప్రజలకు ఇచ్చి ఎమ్మెల్యే ఎన్నికలకు వెళ్లాలని ఆయన సవాల్ విసిరారు. ఎమ్మెల్యేపై మాట్లాడేస్థాయి నాది కాదని అంటున్నాయన పైడిపాలెం నుంచి వచ్చినప్పుడు ఎమ్మెల్యే రాచమల్లు స్థాయి ఏంటో చెప్పాలన్నారు. దొంగనోట్లు, మట్కా, పేకాట, బెట్టింగ్ ఆడిస్తూ 50 ఏళ్ల ప్రొద్దుటూరు చరిత్రను ఎమ్మెల్యే మంటగలిపారన్నారు. ఇవన్నీ మీరు చెయ్యకపోతే ఎమ్మెల్యే ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబివుల్లా, రాజుపాలెం టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, తాటి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అర్బన్ సిఐని సస్పెండ్ చేయాలని నిరసన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించిన జమ్మలమడుగు అర్బన్ సిఐ సదాశివయ్యను సస్పెండ్ చేయాలని జమ్మలమడుగు డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం మహిళలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఎరుకుల మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించి వారిపై బూటు కాలు ఎత్తిన జమ్మలమడుగు అర్బన్ సిఐను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. గత నెల 16న రాత్రి సుమారు 10 గంటల సమయంలో పట్టణం ఎరుకల కాలనీ మోటు వద్ద వినాయక విగ్రహం ముందు భక్తి పాటలు పెట్టుకొని చిన్న పిల్లలు డాన్సులు వేస్తుండగా.. అనుమతులున్నా అర్బన్ సిఐ సదాశివయ్య దౌర్జన్యంగా ముందస్తు హెచ్చరికలు లేకుండా డిజెని పగలకొట్టి, వినాయక బొమ్మను తీసుకెళ్లి స్టేషన్లో పెట్టారన్నారు. నైట్ సెంట్రీ లక్ష్మణ్ నాయక్‌ను తిట్టకున్నా తిట్టినట్లు తప్పుడు కేసు పెట్టి రాత్రంతా ఇష్టానుసారంగా కొట్టారని ఆరోపించారు. సెంట్రీ లక్ష్మణ్ నాయక్, సీఐ సదాశివయ్యలపై చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు షేక్ షరీఫ్ తెలిపారు. ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకురాలు నాగస్వరం గోవిందమ్మ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎరుకల విజయ మాట్లాడుతూ కానిస్టేబుల్స్ కెసి ఓబులేసు, గజేంద్రనాథ్‌రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిషోర్, నాగస్వరం యువరాజు, షేక్ షరీఫ్, మహబూబాషా, రమేష్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత మహిళలు

సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

జెఎన్‌టియు అనంతపురం విడుదల చేసిన ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. సిఎస్‌సి విభాగానికి చెందిన శ్వేత 91.72శాతం, భవ్యశ్రీ 89.35శాతం, ఇసిఇ విభాగానికి చెందిన దివ్యాంజలి 88.70శాతం, సుష్మ 87శాతం, ఇఇఇ విభాగానికి చెందిన వీర ప్రశాంతి 8849, సాయి దీపక్ 86.98, సివిల్ విభాగానికి చెందిన భువనేశ్వర్‌రెడ్డి 80.32, ప్రియాంక 80శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించింది.

విద్యార్థులకు అందమైన చేతిరాత ముఖ్యం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు చేతిరాతపై ఆల్ ఇండియా హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ ఎపి స్టేట్ ప్రెసిడెంట్, చేతిరాత నిపుణులు ఎం. మల్లేశ్వరరెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో ప్రతి విద్యార్థికి చదువుతోపాటు చక్కటి చేతిరాత ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు చదవడం, అర్థం చేసుకోవడం, జ్ఞాపకం పెట్టుకోవడం ఒక ఎత్తు అయితే వాటిని జవాబు పత్రంలో అందంగా రాయడం మరో ఎత్తుగా అభివర్ణించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థి దశలోనే చదువుతోపాటు చక్కటి చేతిరాతను అలవరుచుకుంటే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.గంగాభవాని ఆధ్వర్యంలో చేతిరాత గుండ్రంగా రాసిన విద్యార్థులకు తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెరిట్ సర్టిఫికెట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చాపాడు తహశీల్దార్‌గా లక్ష్మీదేవి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు తహశీల్దార్‌గా లక్ష్మీదేవిని నియమిస్తున్నట్లు కలెక్టర్ విజయ్‌రామరాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడున్న తహశీల్దార్ సుభానిని ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇన్‌ఛార్జి తహసిల్దార్‌గా యామినిని కలెక్టర్ నియమించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిని తొలగించి తహశీల్దార్‌గా లక్ష్మీదేవికి పూర్తి బాధ్యతలు అప్పగించారు. లక్ష్మీదేవి సిద్ధవటం తహశీల్దార్‌గా పనిచేసేవారు. ఈమె గతంలో చాపాడులో సీనియర్ అసిస్టెంట్‌గా కూడా పనిచేశారు.



ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించవలసిన ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రంతుల్లయ్య తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు ఎక్కువమంది గైర్హాజరు కావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు ఎజెండా ప్రతులను గౌరవ సభ్యులకు అందిస్తామని ఆయన తెలిపారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి దువ్వూరు

స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి నవరాత్రి సంబంధించి ఆహ్వాన పుస్తక ఆవిష్కరణను సోమవారం ఆర్యవైశ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు లింగం పట్టాభి రామయ్య మాట్లాడుతూ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఈనెల 15 నుండి 23వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. ఆలయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పుస్తకావిష్కరణలో ఆర్యవైశ్యులు

పట్టిసీమ నుంచి రాయలసీమకు నీళ్లేవీ..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గోదావరి జలాలు కృష్ణా జలాల్లో కలిసినప్పుడు దాదాపు 80 టిఎంసిలు, పై రాష్ట్రాలకు చెందుతాయని బ్రిజేష్ ట్రిబ్యునల్ అవార్డు ఇచ్చిందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే అప్పట్లో చాలామంది నాయకులు రాయలసీమకు పోలవరం వల్ల న్యాయం జరగబోతుందని చెప్పారన్నారు. ఇప్పుడు 80 టిఎంసిల్లో తెలంగాణ 45 టిఎంసిలు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించుకోబోతుందని, మిగతా 35 టిఎంసిలు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు తీసుకుపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో పట్టిసీమ ద్వారా రాయలసీమకు వచ్చే నీళ్లు ఎక్కడికి పోతున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయనప్పుడు ముందు, అంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయనప్పుడే బ్రిజేష్ ట్రిబ్యునల్ అవార్డు ఇచ్చిందన్నారు. అప్పుడు రాయలసీమకి నీళ్లు అని చిలుక పలుకులు పలికిన నాయకులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారన్నారని ప్రశ్నించారు. ఒకవేళ రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు జరిగి ఉంటే పైన రాష్ట్రాలకు ఈ 80 టిఎంసి నికర జలాల్లో రాయలసీమకు కొన్ని అయినా దక్కేవన్నారు. రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు మాత్రమే రాయలసీమకు కృష్ణా జలాల్లో న్యాయం జరుగుతుందని ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామానికి చెందిన చీమల సూర్యనారాయణరెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ యువతికి రూ.5 లక్షలు టోకరా పెట్టిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలు అందించిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నకరికల్ మండలం రుసుం బిందుమాధవి అనే యువతి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తన తమ్మునికి ఉద్యోగం ఇప్పించేందుకు తనతోపాటు పనిచేస్తున్న సూర్యనారాయణరెడ్డికి రూ.5 లక్షలు అందజేసినట్లు ఆమె తెలిపారు. అయితే ఉద్యోగం ఇప్పించకపోగా తాను తీసుకున్న రూ.5 లక్షలు తిరిగి ఇవ్వలేదని ఆమె వాపోయారు. బాధితురాలు సోమవారం చియ్యపాడులో సూర్య నారాయణరెడ్డి ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేశారు విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని స్టేషన్‌కు తరలించారు.



సూర్యనారాయణ ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న బాధితురాలు

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పత్తూరు దళితవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీధర్ సోమవారం కడపలోని తన నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఇటీవల బదిలీపై చిట్వేలి మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సంబంధిత విద్యాశాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. శ్రీధర్‌కు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు తెలిసింది. విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తన విధులను కొనసాగిస్తుండేవారని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల వేధింపులు, పని ఒత్తిడి వంటి సమస్యలు ఎక్కడా ఎదురవలేదని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. విషయం తెలిసిన ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



శ్రీధర్ (ఫైల్‌ఫొటో)